

# బొమ్మా బొరుసూ

- భట్టిప్రోలు విజయలక్ష్మి

"అమ్మా! నిన్న రాత్రి పక్కింటి శంకరం ఇంట్లో దొంగలు పడి ఇల్లంతా దోచుకుపోయార్ట" చెప్పాడు పండరి.

"అయ్యో! ఏ మేం పోయాయి?" ఆదుర్దాగా అడిగింది శకుంతలమ్మ.

"చాలా పోయినాయ టమ్మా! శంకరం భార్య ఒంటి మీద మంగళసూత్రాన్ని కూడా వదిలిపెట్టలేదట వాళ్ళు."

"అ దేమిటి? వాళ్ళు కనీసం కేక అయినా వెయ్యలేదు" ఆశ్చర్యంగా అడిగింది శకుంతలమ్మ.

లోపల నుంచి భర్తకీ, అత్తగారికీ కాఫీలు తెచ్చి అందిస్తూ అన్నది వనజ - "అది కాదండీ! మొత్తం ముగ్గు రొచ్చారుట. రెండు గుమ్మాల దగ్గరా ఇద్దరు కావలా ఉంటే మూడోవాడు తలుపు పగలగొట్టి లోపలికి దూరాడట. వీళ్ళు మెలకువ తెచ్చుకుని లేచేసరికే దోమతెర బయట వాడు కత్తితో సహా సిద్ధంగా ఉన్నాట్ట. ఇందాకే శంకరం గారి భార్య చెప్పింది."

"అయ్యో పాపం!" అంది శకుంతలమ్మ విచారంగా.

"అంతే కా దత్తయ్యా! శంకరంగారిని కానీ, పిల్లని గానీ దోమతెర లోంచి బయటకు వస్తే చంపేస్తా నని బెదిరించాడుట. లలితని ఒక్కదాన్నే బయటికి రమ్మన్నాట్ట. పాపం లలిత అసలే భయస్తురాలా, ఇంకా వణికిపోయిం దట. బల్బులు వేస్తే వాళ్ళ మొఖాలు చూసి ఆనక గుర్తు పడతా రేమో నని బల్బు లేవీ వేయనీయలేదుట. దోచుకున్న వన్నీ లలిత చేతే తీయించి, మూట కట్టించి మరీ పట్టుకుపోయారట. పైగా ఇంట్లో ఉన్న వెయ్యి రూపాయలూ పట్టుకుపోతూ 'ఇంతేనా ఇంట్లో ఉన్నదీ. సిగ్గు లేదూ మీకు?' అన్నాట్ట. పోతూ పోతూ 'మొగు డున్నాడు కదా నీకు, మంగళసూత్రం కూడా ఎందుకు అది మా కిచ్చేయ్' అని గట్టిగా గుంజుకున్నారుట. పాపం లలిత పెనుగులాడితే మెడ గీసుకుపోయింది కూడానూ." ఉద్వేగంగా చెప్పింది వనజ.

"వాడి నోరు పడిపోనూ! వాడి చేతు లిరిగిపోనూ! వెధవకి ముత్తైదు మెళ్ళో మంగళసూత్రం లాగటానికి చేతు లెలా వచ్చాయో! పంది వెధవ! కలికాలం కదా! తన మహత్తు చూపిస్తోంది" కోపంగా తిడుతూ అంది శకుంతలమ్మ.

"మొత్తానికి దాదాపు పది తులాల బంగారం, రెండు వెండి కంచాలూ, ఆవిడవి ఒక అయి దారు మంచి పట్టు చీరలూ, డబ్బూ పట్టుకుపోయార్ట. పోతూ పోతూ కూడా శంకరం స్కూటరే ఎక్కి మరీ పోయారట" చెప్పాడు పండరి.

"అయ్యో! స్కూటరూ పోయిందా?" బాధగా అడిగింది శకుంతలమ్మ.

"లేదమ్మా! స్కూటర్ ఊరి బయట దొరికిందట. పోలీసులు తెచ్చి ఇచ్చారు. వాళ్ళ అంచనాల ప్రకారం దొంగలు బహుశా నల్గొండ వైపు వెళ్ళి ఉండవచ్చని తెలుస్తోంది. నాలుగు రోజుల్లో పట్టుకుని అన్నీ ఇప్పిస్తాము అని పోలీసులు అన్నారట" అన్నాడు పండరి.

"ఆఁ పోయిన వస్తువు తిరిగి వస్తుందా? అవన్నీ ఉత్త మాటలు. అయినా ఈ రోజుల్లో దొంగతనాలు మరీ పెచ్చు మీరిపోతున్నాయి. నట్టింటో తలు పేసుకుని పడుకున్న వాడికి కూడా భద్రత ఉండటం లేదు" వాపోతూ అంది శకుంతలమ్మ.

"అత్తయ్యగారూ! మీ రేమీ అనుకోనంటే నే నొక మాట చెపుతాను. నేనూ, ఆయనా ఇద్దరం రోజంతా ఇంట్లో ఉండం. మీ రొక్కరే ఉండాలి. మేము లేని అదును కనిపెట్టి ఎవడన్నా ఇంట్లోకి చొరబడితే ఏం కాను చెప్పండి? మీ రేమో నిత్యం బోల్డంత బంగారం వేసుకుని ఉంటారు. కొంచెం 'ఈ దొంగతనాల జోరు తగ్గేదాకా మీ మెళ్ళో ఆ నాలుగు పరసల చంద్రహారం, చేతి నాలుగు జతల గాజులూ తీసి ఇవ్వండి. లాకర్‌లో పెడతాను. ఇప్పుడు అవి లేకపోతే కొత్తగా వచ్చే నష్టం ఏమీ లేదు కదా!"

వనజ ఈ మాట అనగానే ఒక్కసారిగా శకుంతలమ్మ బిగిసిపోయింది వెంటనే పొడిపొడిగా సమాధానం చెపుతూ "పర్వాలేదు. నా కేం అలాంటి భయాలు లేవు" అంది ఆ మాట అక్కడితో ఆపేయా లన్నట్లు.

"అవునమ్మా! వనజ చెప్పిన మాట బాగుంది. నా కెందుకో ఇన్నాళ్ళూ ఆ ఆలోచనే రాలేదు. మేం లేనప్పుడు ఎవడన్నా వచ్చి నీ గొంతు పిసికితే కూడా పలికే దిక్కు లేదు. బంగారం పోతే పోయింది. నీ కేమన్నా అయితే మరీ కష్టం కదూ! అసలే గ్రాము బంగారం ధర మూడొందల ముప్పై రూపాయ లుంది ఈ రోజు" అన్నాడు పండరి.

"ఏం పర్వాలేదు. బంగారం కొనుక్కున్నది ధరించటానికే. నేను నా ఒంటి మీద బంగారం తియ్యను. బంగారం ఉండి కూడా మీ అందరిలా నేను బోడి బొమ్మలా ఉండలేను." శకుంతలమ్మ మాటల్లో విముఖత స్పష్టంగా కనిపించింది.

"అది కా దత్తయ్యగారూ. నేను చెప్పింది మీ క్షేమం ఆలోచించే. ఇందులో నా కేమిటి లాభం?" అంది వనజ బాధగా.

"లాభం నీ కెందుకు లేదూ? ఉన్న లాభమే నీకు. నా బంగారం నా ఒంటి మీంచి నేను బ్రతికుండగానే ఒలుచుకు పోదామని చూస్తున్నారు. నా పేరు మీద ఉన్న ఇల్లూ, పొలమూ వాడి పేరు మీదికి మార్పించుకోవాలని వాడూ, నా బంగారం ఊడలాక్కోవా లని నువ్వూ చేస్తున్న ప్రయత్నాలు నాకు తెలియవా ఏం? అయినా ఏదో నా పేరు మీద ఆ ఆస్తి నా ఒంటి

